క్లుప్తంగా

కేసులు పరిష్కరించాలి



పోలీసులతో పరేడ్ నిర్వహిస్తున్న దృశ్యం

ఏన్కూరు: పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సత్తుపల్లి ఏసీపీ రఘు కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీసులతో పరేడ్ నిర్వహించారు. అనంతరం స్టేషన్ రికార్డులు, కేసుల వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా ఏర్పాటు

బోనకల్: గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ముసాయిదా, పోలింగ్ స్టేషన్ల జాబితాను మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో, పాఠశాలలో, మండల పరిషత్ కార్యాలయ నోటీస్ బోర్డుల్లో ఉంచడం జరిగిందని ఎంపీడీఓ రమాదేవి తెలిపారు. ముసాయిదా జాబితాను శనివారం బోనకల్ పోలింగ్ స్టేషన్‌లో పరిశీలించి మాట్లాడారు. ఏమైనా అభ్యంతరాలుంటే 12లోగా.. మండల పరిషత్ కార్యాలయంలో తెలపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ శాస్త్రి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కళాజాతా..

వైరా: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కళాజాత బృందం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికాలంగా చేసిన పథకాలు, అభివృద్ధిపై బృందం ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో కళాజాతా బృంద సభ్యులు జాన్, సుధాకర్‌రావు, అజయ్, కృష్ణ, భద్రయ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చౌక దుకాణాలను బలోపేతం చేయాలి

కారేపల్లి: పేదలకు ఆహార భద్రత కల్పించే చౌక దుకాణాలను బలోపేతం చేయాలని ఐద్వా మండల కార్యదర్శి కొండబోయిన ఉమావతి డిమాండ్ చేశారు. శనివారం చౌకదుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని కోరుతూ.. ఐద్వా ఆధ్వర్యంలో మండలంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టి మాట్లాడారు. సేకరించిన సంతకాలను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు మేకల మౌనిక, బానోత్ శారద, గురులక్ష్మి, శారద, రమ్య, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

బెంచీ ఏర్పాటుపై నిరసన

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని 4వ వార్డులో గల హనుమాన్ నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ రంగుతో సిమెంట్ బెంచీ వీధిలో ఏర్పాటు చేయటంపై స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. కొందరు వ్యక్తులు వచ్చి బీఆర్ఎస్ పార్టీ రంగుతో ఉన్న బెంచీని వాటర్ ట్యాంక్ రోడ్డులోని ఓ ఇంటి ముందు పెట్టడంతో స్థానికులు వాగ్వాదానికి దిగి.. ధ్వంసం చేశారు. ఎమ్మెల్యే రాగమయి పేరు లేకుండా ఏర్పాటుచేయడం ఏంటని ఆందోళన చేపట్టారు. అనంతరం అట్టి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైతులపై దాడి దుర్మార్గపు చర్య

వైరా: ఢిల్లీ వైపు చట్టబద్ధమైన గిట్టుబాటు ధరలు డిమాండ్ చేస్తూ శాంతియుతంగా వస్తున్న రైతులపై శంభు సరిహద్దు వద్ద టియర్‌గ్యాస్, రబ్బర్ బుల్లెట్లతో దాడి చేయడం దుర్మార్గపు చర్య అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శనివారం స్థానిక బోడేపూడి వెంకటేశ్వరావు భవనంలో నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ప్రభుత్వ సహాయం కోసం బిక్షాటన చేయడం సరికాదని వ్యవసాయ మంత్రి తుమ్మల వ్యాఖ్యానం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు రామారావు, చలపతిరావు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

ఏన్కూరు: ఆశావర్కర్స్ యూనియన్ అనుబంధ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ నెల 10న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఏర్పుల రాములు పిలుపునిచ్చారు. ఆశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. ప్రభుత్వ వైద్యాధికారి రాములుకు శనివారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి బానోత్ అమల, స్వాతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పిక్నిక్‌ల సందడి..



ఆటపాటలతో సందడి చేస్తున్న కళాశాల విద్యార్థినులు

- ఆహ్లాదమైన వాతావరణంలో.. ఆనందంగా
- పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల టూర్లు

సండే స్పెషల్

సత్తుపల్లిటౌన్: విందు వినోదాల మేళవింపుగా ఆటపాటలతో పిక్నిక్‌లు.. విహార యాత్రలతో విద్యార్థులు సందడి చేస్తున్నారు. వార్షిక పాఠ్యాంశాల సిలబస్‌లు పూర్తి కావటంతో చదువు ఒత్తిడి నుంచి ఆహ్లాదంవైపు మళ్లించేందుకు విద్యాసంస్థలు విజ్ఞాన యాత్రలు చేపట్టాయి. చెట్ల నీడన సరదాగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి తినటం.. ఆనందంగా గెంతులు వేయటం.. కొద్దిపాటి జలాశయాల వద్ద ఆహ్లాదంగా గడిపేస్తున్నారు.

టూర్లతో మానసిక ఉల్లాసం..

సత్తుపల్లి ప్రాంతంలోని విద్యార్థులు, పాఠశాలల పిల్లలు, చిన్నారులు సమీపంలోని పర్యాటక ప్రాంతాల్లో పిక్నిక్‌లకు వెళ్లి ఆనందోత్సాహాలతో కేరింతలు కొడుతూ రోజంతా సందడి చేస్తున్నారు. నిత్యం పుస్తకాలతో కుస్తీపట్టే విద్యార్థులకు పిక్నిక్‌లు, విహార యాత్రలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తున్నారు.

పిక్నిక్ స్పాట్లు ఇవే..

పిక్నిక్ అంటేనే పిల్లల్లో ఎక్కడా లేనంత ఆనందం ఉప్పొంగుతోంది. అది కూడా చల్లని చెట్లనీడన.. పారుదల ఉండే నీటిలో దిగటమంటే ఇంకా ఉరకలేస్తూ సందడే సందడి.. సత్తుపల్లికి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న బూర్గంపహాడ్‌కు సమీపంలో గల విశాలమైన పాములేరులో ఈ ప్రాంతంలోని విద్యార్థులు వెళ్లి ఖుషి.. ఖుషీగా గడిపేస్తున్నారు. ఇక్కడ ఇరువైపుల విశాలంగా ఉండటంతోపాటు వెడల్పైన్న ఆ ఏటిలో గోదావరివైపు ప్రవహించే స్వచ్ఛమైన రెండు అడుగుల లోతు వరకు మాత్రమే నీరు ఉండటం.. సురక్షితం.. ఆహ్లాద ప్రదేశంగా ఉండటంతో విద్యార్థులు ఇష్టపడుతున్నారు. ఇంకా నీరు, ఇసుక, చెట్లనీడన ఆటపాటలతో సందడి చేస్తున్నారు. ఇక్కడ నీటిలో వాలీబాల్, కబడీ, పరుగుపందెం, కుప్పిగంతులు జలకాలాటలతో పిల్లల్లో ఉత్సాహం నింపుతుంది.



నీలాద్రి అర్బన్‌పార్కులో..



నీటిలో ఉత్సాహంగా..

ఈ ఆలయాలు ఆహ్లాదకరమే..

పెనుబల్లి మండలంలోని నీలాద్రీశ్వరాలయం, సత్తుపల్లి మండలంలోని చెరుకుపల్లి గిన్నెతోగు, అన్నపురెడ్డిపల్లి శివాలయం, పులిగుండాల ప్రాజెక్టు, కిన్నెరసాని ప్రాంతాలకు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు ఎక్కువగా వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రీ ప్రైమరీ చిన్నారులు సత్తుపల్లిలోని నీలాద్రి అర్బన్‌పార్కులో ఆహ్లాదకరంగా గడిపేస్తున్నారు.

ఎంతో ఆహ్లాదంగా..



చదువు ఒత్తిడికి కాకుండా ఉండేందుకు విహారయాత్రలు చాలా ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. మా కళాశాల విద్యార్థులందరూ కలిసి పాములేరులో పిక్నిక్‌కి వెళ్లాం. అక్కడ ఎంతో ఆహ్లాదంగా ఉంది. రోజంతా చాలా సరదాగా ఎంజాయ్ చేశాం.

– వి.అక్షయ, శ్రీనారాయణ జూనియర్ కళాశాల, సత్తుపల్లి

ఆటవిడుపుగా..



రోజు పుస్తకాలతో కుస్తీ పట్టే మేము పిక్నిక్‌లో ఆట విడుపుగా గడిపాం. ఇలాంటి విహార యాత్రలు విద్యార్థుల్లో ఉత్తేజాన్ని కలిగిస్తాయి. అందరం కలిసి చెట్ల కింద కూర్చొని భోజనం చేయడం మరిచిపోలేని అనుభూతిని ఇచ్చింది.

– వి.తేజ తన్మయి, వాణి విద్యాలయం, సత్తుపల్లి

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్, మున్సిపల్ చైర్మన్ జైపాల్



పెనుబల్లిలో పల్లెదవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

వైరా/వైరారూరల్: పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. శనివారం ఆయన మండలంలో పర్యటిస్తూ.. ప్రజల సమస్యలు వింటూ వినతులు స్వీకరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో డ్వాక్రా సంఘాలకు, వీధి వ్యాపారులకు రూ. 1.85 కోట్ల రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా 2కే రన్‌లో పాల్గొని.. మున్సిపాలిటి పరిధిలో 1, 3, 4, 14 వార్డులతో పాటుగా.. తాటిపూడి, రెబ్బవరం, గొల్లపూడి, గొల్లెనపాడు గ్రామాల్లో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. గొల్లపూడిలో దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రెబ్బవరంలోని బీసీ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమాలల్లో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాదు, మండల అధ్యక్షుడు వెంకట నర్సిరెడ్డి, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

● పెనుబల్లి: మండలంలోని ఎమ్మెల్యే మట్టా రాగమయి శనివారం పర్యటించి.. పలుగ్రామాల్లో అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మండలంలోని రామచందర్‌రావు బంజర్, వీయంబజర్, పెనుబల్లి, రంగారావు బంజర్, కుప్పెనకుంట్ల, గుట్టపాడు, ముత్తగూడెం, గణేష్‌పాడు, అడవిమల్లెలల గ్రామాల్లో రూ.కోటి నలభై లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణాలకు, యడ్లబంజర్‌లో రూ.కోటి పదిలక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా వీయంబర్‌లో రూ.10లక్షలతో నిర్మించన్ను పంచాయతీ భవనానికి, పెనుబల్లిలో రూ.20 లక్షలతో పల్లెదవాఖానా లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజా దేవి, వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, నాయకులు సీతారామారావు, శ్రీనివాసరెడ్డి, రామారావు, వెంకటేశ్వరరావు, చిన్నస్వామి, కోటేశ్వరరావు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తుమ్మల యుగంధర్..

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయిని ఆమె నివాసంలో శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నర్సింహారావు, భరత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోడులో ఉద్రిక్తతలకు స్వస్తి పలకాలి



మాట్లాడుతున్న కృష్ణ

కారేపల్లి: ఏజెన్సీలో పోడు ఉద్రిక్తతలకు ప్రభుత్వం స్వస్తి పలికేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గి కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం కారేపల్లిలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు వజ్జా రామారావు అధ్యక్షతన నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్లుగా సాగుచేసుకుంటున్న గిరిజనులు, గిరిజనేతరులకు పోగుపై హక్కు కల్పించాలన్నారు. ఖమ్మం జిల్లాలో ఐటీడీఏ లేకపోవంతో సంక్షేమ పథకాలు గిరిజనులకు దూరమవుతున్నాని.. పాలకుల్లో చిత్తశుద్ధి లోపించిందన్నారు. సమావేశంలో నాయకులు సీతారాములు, జోగయ్య, వీరస్వామి, మల్లయ్య, ధనమ్మ, గంగరాజు, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన న్యాయ చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం 15వ బెటాలియన్‌లో శిక్షణ పొందుతున్న పోలీస్ కానిస్టేబుళ్లకు శనివారం నూతన న్యాయచట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి 6వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాస్, సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.కే. మీరా ఖాసీం సాహెబ్ మాట్లాడుతూ నూతన న్యాయ చట్టాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా విధినిర్వహణ సులువవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కమాండెంట్ రంగారెడ్డి, శిక్షణ ఆర్ఐ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



మధిర: మాంగల్యాన్ని చూపిస్తున్న అర్చకుడు



తల్లాడలో స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మధిర: మధిర పట్టణంలోని బంజారా కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి కల్యాణం ఘనంగా జరిగింది. సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం నిర్వహించగా.. పలువురు దంపతులు పీటలపై కూర్చున్నారు. అదేవిధంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గుర్రం ప్రమీల, మున్సిపల్ కౌన్సిలర్లు మల్లాది వాసు, సవిత, ఆలయ కమిటీ బాధ్యులు కటకం నరసింహారావు, గంగవరపు వీరారెడ్డి, కోనేరు లీలాశంకర్, గుర్రాల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: తల్లాడలో శనివారం అంగరంగ వైభవంగా సుబ్రహ్మణ్య స్వామికి కావడి సేవ, పల్లకి ఊరేగింపు జరిగింది. స్థానిక కొత్తగూడెం రోడ్డులో వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం ఐదో వార్షికోత్సవం, సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా.. పల్లకిలో వల్లీదేవి సమేత సుబ్రహ్మణ్య స్వామి వార్లను ఊరేగించారు. అనంతరం తనుగుల మణికంఠశర్మ, యాసా నాగేంద్ర ప్రసాద్, పున్నం శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో స్వామికి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అన్నదానం నిర్వహించారు.

‘థింకింగ్ బియాండ్’ అంశంపై సెమినార్



అవగాహన కల్పిస్తున్న అభయ ఫౌండేషన్ సీఎస్ బాలచంద్ర

సత్తుపల్లిరూరల్: స్థానిక మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో థింకింగ్ బియాండ్(విస్తృత ఆలోచన విధానం) అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సెమినార్‌లో హైదరాబాద్‌కు చెందిన.. అభయ ఫౌండేషన్ సీఎస్ బాలచంద్ర సంకు మాట్లాడారు. ప్రతీ విద్యార్థి సక్సెస్ సాధించాలంటే ప్రధానంగా నాలుగు అంశాలపై దృష్టి సారించాలన్నారు. అవి వినడం, రాయడం, మాట్లాడటం, చదవడం అంశాలపై పట్టు సాధిస్తే తద్వారా ప్రతి వ్యక్తికి జ్ఞాపకశక్తి, సృజనాత్మక పెరుగుతాయన్నారు. అనంతరం పులువురి ప్రముఖుల గురించి వివరించారు. మహిళలపై దాడులను ఎలా ప్రతిఘటించాలో బాలికలకు వివరించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ, ఇంజనీరింగ్ డీన్ జాకీర్ హుస్సేన్, ఐక్యూ ఎస్సీ కోఆర్డినేటర్ రామచంద్రరావు, సీఎస్సీ విభాగ అధిపతి మారేశ్వరరావు, కార్యక్రమం కోఆర్డినేటర్ మురళీకృష్ణ, శ్రీసత్యసాయి సేవా సమితి జిల్లా ఆర్గనైజర్ సుధాకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శిగా గోపాలరావు



మడుపల్లి గోపాలరావు

మధిర: సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శిగా చింతకాని మండలం తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన మడుపల్లి గోపాలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మల్లారం గ్రామంలో జరిగిన పార్టీ డివిజన్ మహాసభలో పార్టీ మధిర డివిజన్ కార్యదర్శిగా ఎన్నిక కాగా.. ఆయనను పలువురు అభినందించారు.

నియోజకవర్గ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా ‘ఇజ్జగాని’



ఇజ్జగాని మాధవరావు

వేంసూరు: సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా వేంసూరు మండలానికి చెందిన ఇజ్జగాని మాధవరావు ఎన్నికయ్యారు. దీంతో నియోజకవర్గ నాయకులు ఆయనను అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్ల యాప్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కల్లూరురూరల్: కల్లూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల యాప్‌పై కార్యదర్శులకు అవగాహన కల్పించారు. సర్వేకు సంబంధించిన యాప్‌ను జీపీ కార్యదర్శులకు డౌన్లోడ్ చేశారు. దీంతో వారు యాప్‌లో లాగిన్ అయి ఇదివరకే ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో.. స్థలాలు ఉండి, ఇల్లు కట్టుకోలేని వారి వివరాలను నమోదు చేస్తారు. ఈ సర్వే ఆదివారం నుంచి ప్రారంభం కానుండడంతో.. కల్లూరు తహసీల్దార్ సాంబ శివుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఐకేపీ ఏపీఎం వెంకట రామారావు.. పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎంపీఓ సురేష్‌బాబు, ఈజీఎస్ ఏపీఎం హేమమాలిని, ఐకేపీ సీసీలు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం



తల్లాడ: పినపాకలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు



ముదిగొండ: మాదాపురంలో..



కారేపల్లి: విశ్వనాథపల్లి హైస్కూల్‌లో..

చింతకాని: మండలంలో నాగులవంచలో శనివారం సీఎం కప్ గ్రామస్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. 18 సంవత్సరాల వయస్సు పైబడిన యువకులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

● **ముదిగొండ:** మండలంలోని మాధాపురం, గోకినేపల్లి, ముదిగొండ, కమలాపురం, పమ్మి, వనంవారికిష్టాపురం, బాణాపురం, పెద్దమండవ, వల్లబి గ్రామాల్లో శనివారం యువకులతో క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.

● **బోనకల్:** మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలను ఎంఈఓ దామాల పుల్లయ్య ప్రారంభించి మాట్లాడారు.

● **సత్తుపల్లిరూరల్:** మండలంలోని కిష్టారం పాఠశాలలో ప్రారంభమైన క్రీడా పోటీల్లో వివిధ గ్రామాల నుంచి క్రీడాకారులు హాజరరై కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సమ్మద్, పంచాయతీ కార్యదర్శి రమణకుమార్, పీడీ కనకమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **తల్లాడ:** మండలంలోని పినపాక పాఠశాలలో శనివారం నిర్వహించిన పోటీలను ఆ పాఠశాల హెచ్ఎం నరసింహారావు ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ విద్యార్థి క్రీడల పట్ల మక్కువ చూపాలన్నారు.

● **సత్తుపల్లి(కల్లూరు):** కల్లూరు మినీ స్టేడియం గ్రౌండ్‌లో వాలీబాల్ క్రీడా ప్రాంగణ మందు శనివారం గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించిన ఆటల పోటీలను ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ సాంబశివుడు, ఎంఈఓ నివేధిత, ఈఓ నాగేశ్వరరావు, నిర్వాహక కార్యర్శులు బీమా, పసుపులేటి వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

● **కారేపల్లి:** మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో క్రీడా పోటీలను ఘనంగా ప్రారంభించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను గ్రామ పంచాయతీల వారిగా ఎంపిక చేసి, మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దివ్యాంగ బాలబాలికలకు చేయూత అందించాలి

చింతకాని: దివ్యాంగ బాలబాలికలకు అందరూ చేయూతనందిస్తే వారు కూడా సాధారణ బాలలతో సమానంగా ఎదుగుతారని సమగ్ర శిక్షా అభియాన్ సీఎంఓ, దివ్యాంగ బాలబాలికల జిల్లా సమన్వయ కర్త రాజశేఖర్ తెలిపారు. మండలంలోని లచ్చగూడెం భవిత కేంద్రంలో విద్యార్థులకు శనివారం ఆటలు, చిత్రలేఖనం పోటీలను నిర్వహించగా విజేతలకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. పాఠశాల హెచ్ఎం సుబ్బారావు, విజయ్‌భాస్కర్, డాక్టర్ వెంకటేశ్వరరావు, ఐఈఆర్పీలు కేఎస్.కృష్ణారావు, భూక్యా దస్లీ, భవిత కేంద్రం సంరక్షకురాలు లలితకుమారితో పాటు మాజీ కొప్పుల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

ముదిగొండ: ముదిగొండ నుంచి చిరుమర్రి వరకు ఆర్‌అండ్‌బీ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ముదిగొండలో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు రాస్తారోకో, ఆందోళన కార్యక్రమం చేపట్టారు. గత ఆరు నెలల కిందట కంకర, చూర రోడ్లపై పోసి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టకుండా వదిలేశారని, కాంట్రాక్టర్, ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే.. ప్రజల కండ్లల్లో, దుమ్ము, దూళి పడుతున్నాయన్నారు. అనంతరం స్కూల్ ఎదుట ఉన్న అబ్దుల్ కలాం విగ్రహం ఎదుట ప్ల కార్డులతో నిరసన తెలిపారు. ఇకనైనా రోడ్లకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పురుషోత్తం, మాజీ వైస్ ఎంపీపీ దామోదర్, డీవైఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి లోనుకావొద్దు..



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా సమస్యలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్నేహితులతో పంచుకోవాలని వైద్యులు వికాస్, ప్రసన్న సూచించారు. శనివారం సత్తుపల్లిలోని ప్రభుత్వబాలికల జూనియర్ కళాశాలలో టెలీమానస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. వైద్యుల సలహాలకై విద్యార్థులు టోల్ ఫ్రీ నంబర్ 14416కి ఫోన్ చేయాలన్నారు. అధ్యాపకులు లలితమ్మ, ప్రమీల, వనజారాణి, కల్పన, సత్యనారాయణ, కృష్ణవేణి, జబీన, సంధ్యారాణి, ప్రియాంక, పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

తల్లాడ: అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గం ఎస్సీల వర్గీకరణను అమలు చేయాలని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ ఏపూరి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం తల్లాడలో నిర్వహించిన ఆ అనుబంధ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యున్నత న్యాయస్థానం ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించుకొనే అవకాశం రాష్ట్రాలకిచ్చినా ఒకే ఒక్క కులం అడ్డుకోవటం సరైంది కాదన్నారు. కార్యకరమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు అంజయ్య, మండల ఇన్‌చార్జ్ వెంకటేశ్వరరావు, నాగరాజు, సురేష్, బలరాం, రవి పాల్గొన్నారు.

ఏజంట్లు కావలెను
ఖమ్మం జిల్లాలో ఈ క్రింది ఏరియాలకు సాక్షి పేపర్ పంపిణీ చేయుటకు ఏజంట్లు కావలెను.
మధిర
నియమ నిబంధనలు :
1) డిపాజిట్ రుసుము చెల్లించగల స్థోమత కలిగి ఉండాలి.
2) స్థానికులు అయి ఉండాలి. 3) ప్రతి నెల బిల్ సక్రమంగా చెల్లించగలగాలి.
4) పేపర్ ఆలస్యము లేకుండా చందా దారులకు అందజేయగలగాలి.
సంప్రదించవలసిన నెంబర్: 9603462537



మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

రమేష్, ACO - 9059115968
ఖమ్మం ఎన్. ఉపేందర్ - 99591 24151 మధిర వీరబాబు - 98498 64638
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 సత్తుపల్లి జి. బాబు - 79979 58225
వైరా ఐ. రాందాస్ - 98898 81843 టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600
రవికుమార్ - 99499 27792
ఎన్. జయరాజు - 96528 68642